క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది : రుషికొండలో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిని మంగళ వాయిద్యాల నడుమ తీసుకెళ్లి అభిషేకాల అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



దుర్గాలమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అమ్మవారిని అభిషేకించి, విశేషంగా అలంకరించారు. అర్చకులు పట్నాల హరి ప్రసాద్ శర్మ, మూర్తి శర్మ ఆధ్వర్యంలో నిత్య పూజల అనంతరం ప్రత్యేక కుంకుమార్చనలు, పుష్పార్చనలు చేశారు. మధురవాడకు చెందిన లీలానాగ ప్రసాద్, సూర్యకుమారి దంపతుల సహకారంతో పులిహోర, ఇతర ప్రసాదాలను అమ్మవారికి నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లా సూరిబాబు, నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


వర్షంతో చల్లబడిన వాతావరణం



మధురవాడ ప్రాంతంలో ఆహ్లాదకర వాతావరణం

మధురవాడ : రుతు పవనాలు వచ్చాయనే మాటే తప్ప ఇంత వరకు పూర్తిస్థాయిలో వర్షాలు మాత్రం లేవు. ఎండలతో ఉడికిపోతున్న మధురవాడ వాసులకు గత మూడు నాలుగు రోజుల నుంచి చిరుజల్లులు కురిసినా అంతగా ప్రయోజనం లేకపోయింది. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి మధురవాడ పరిసర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాతావరణం కాస్త చల్లడి ప్రజలు సేదదీరారు. వర్షానికి మధురవాడ అప్ బ్రిడ్జి, మార్కెట్, హైస్కూల్, గాంధీ నగర్ వుడా కాలనీ జంక్షన్ తదితర లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

పోలీస్ గ్రీవెన్స్‌కు స్పందన



సీపీకి వినతులు అందజేస్తున్న సిబ్బంది

అల్లిపురం : నగర పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సిబ్బంది గ్రీవెన్స్‌కు స్పందన లభించింది. శాంతి భద్రతలు, ట్రాఫిక్, క్రైమ్, ఏఆర్‌కు సంబంధించి 30 మంది సిబ్బంది శాఖాపరమైన సమస్యలపై నేరుగా సీపీ డాక్టర్ రవిశంకర్‌కు వినతులు అందజేశారు. ఇంక్రిమెంట్లు, డిప్యుటేషన్, ఆరోగ్య సమస్యలు, ప్రమోషన్లకు సంబంధించి అందిన వినతులపై స్పందించిన సీపీ వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

యోగాతో ఆరోగ్యం, ఆనందం

యోగాభ్యాసంతో ఆరోగ్యం, ఆనందం సొంతమవుతాయని యోగా గురువులు ఉద్ఘాటించారు. నిరంతర యోగ సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలోని యోగా కేంద్రాలతో పాటు విద్యాసంస్థల్లో, పార్కుల్లో, కోర్టు ప్రాంగణంలో, కార్యాలయాల్లో యోగా సాధన చేశారు. యోగా చేయడం వల్ల చేకూరే ప్రయోజనాలను నిపుణులు సాధకులకు తెలియజేశారు.



భీమిలిలోని అంతర్జాతీయ యోగా కేంద్రంలో యోగాసనాలు వేస్తున్న యోగా సాధకులు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

భీమునిపట్నం: యోగా దినోత్సవాన్ని నియోజకవర్గ పరిధిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భీమిలిలోని యోగా చైతన్య సంస్థ వద్ద యోగా గురువు డి.సత్యనారాయణ ఆధ్వర్యంలో సాధకులు పలు యోగాసనాలను ప్రదర్శించారు, ఇందులో చిన్నపిల్లలు, పెద్దలు, వృద్ధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లడుతూ ఎటువంటి అనారోగ్యం లేకుండా ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించాలంటే ప్రతి ఒక్కరు యోగాను అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో ఎం.రాంబాబు, ఎస్.జనార్దనరావు, గాడు వెంకట నారాయణ, జి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

- కోర్టు ప్రాంగణంలో జడ్జీలు నాగేశ్వరరావు, సౌజన్య సమక్షంలో కోర్టు సిబ్బంది, యోగా శ్రమం నుంచి వచ్చిన సభ్యులు యోగాసనాలను ప్రదర్శించారు.
- ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రధాన వైద్యులు ఫణికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది యోగాసనాలు ప్రదర్శించారు, ఇందులో వైద్యులు కల్యాణ్ శ్రీనివాస్, డాక్టర్ యోగేష్ పాల్గొన్నారు.
- తగరపువలస సమీపంలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించారు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రతీ విద్యార్థి యోగాను నిత్యకృత్యంగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, అవంతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు, అవంతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అర్జునరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి షరీఫ్, పీడీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.
- తాటితూరు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల వద్ద ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఉపాధ్యాయులు ప్రసాదరావు, ప్రభావతి, మురళీధర్ పాల్గొన్నారు.

యోగాతో పలు ఉపయోగాలు..

మధురవాడ : యోగాతో మానసిక ఒత్తిడిని జయించటమే కాకుండా ప్రశాంతత, జ్ఞాపక శక్తి వంటి వాటిని కూడా పొందొచ్చని ప్రముఖ యోగా మాస్టర్ కేవీకే కళాధరరావు తెలిపారు. మధురవాడ విజయం స్కూల్లో నిర్వహించిన యోగా వేడుకల్లో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లల్లో జ్ఞాపక శక్తి పెరుగుదలకు వ్యాయామంతో పాటు ఆహార అలవాట్లు కూడా మార్పు చేస్తే మంచిదన్నారు. ఈ సందర్భంగా ఆయనను ప్రిన్సిపాల్ విజయలక్ష్మి కళాధరరావు సత్కరించారు.

- బీజేపీ 5వ వార్డు ఉపాధ్యక్షుడు తులసి రామరెడ్డి యోగాసనాలు వేసి యోగా ప్రాధాన్యతను వివరించారు. టీడీపీ, బీజేపీ నాయకులు తాతపూడి ప్రదీప్‌కుమార్, వీపీ ప్రసాదరావు, పి.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండాడలో..

కొమ్మాది: ఎండాడలో డాక్టర్ లూక్స్ ప్రాంగణం సెంటర్ ఫర్ యోగా, వెల్‌నెస్, సెయింట్ లూక్స్ నర్సింగ్ విద్యా సంస్థలు సంయుక్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించాయి. శుక్రవారం ఉదయం 5 గంటల నుండి 8 గంటల వరకు యోగాసనాలు వేసి, యోగా వలన కలిగే ప్రయోజనాలను యోగా విలేజ్ అధ్యాపకురాలు డా.సి.శ్రావణి తెలిపారు. వృద్ధాప్య ఛాయలు, నిద్రలేమి, కంటి సమస్యలతో సహా అనేక ఆరోగ్య సమస్యలు యోగాతో తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో సెయింట్ లూక్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ప్రీతమ్ లూక్ తదితరులు పాల్గొన్నారు.

- గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో కోడి రామ్మూర్తి ఇండోర్ స్టేడియంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రో వైస్ చాన్స్‌లర్ వై. గౌతమ్‌రావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు.



మధురవాడలో యోగాసనాలు వేస్తున్న బీజేపీ నాయకులు

పలు పాఠశాలల్లో..

పద్మనాభం : మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పద్మనాభం, మద్ది, రెడ్డిపల్లి, రేవిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అర్చకునిపాలెం, పద్మనాభం, పాత కొవ్వాడ, ఐనాడ, కోరాడ, పాండ్రంగి, చిన్నాపురం ప్రాథమిక పాఠశాలల్లో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగాసనాలు వేసి అందరినీ అబ్బురపరిచారు.

ఆరోగ్యానికి దివ్య ఔషధం

తగరపువలస: స్థానిక ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల డీన్ డా. పి.వి సుధాకర్ మాట్లాడుతూ యోగాను జీవితంలో ఒక అలవాటుగా మార్చుకోవాలన్నారు. ఇది ఆరోగ్యానికి మేలు చేసే ఓ గొప్ప ఔషధమని పేర్కొన్నారు.

శిల్పారామంలో..

పీఎంపాలెం: శిల్పారామంలోని యోగా కేంద్రంలో యోగా దినోత్సవం నిర్వహించారు. డీవీస్ జీఎం ఎంఎస్ఎన్ రావు మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవనంలో యోగా తప్పనిసరి అని పేర్కొన్నారు.

బంగ్లామెట్ట పాఠశాలలో..

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం ఆర్. అప్పలరాజు ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. విద్యార్థులు పలు రకాల యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్. రమేష్, బి.మల్లిక, పి.నాగమణి పాల్గొన్నారు. దాకమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ వేడుకలు నిర్వహించారు.

- ఎస్ఎస్ఆర్ఐటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం ఆధ్వర్యం జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ ఎస్.శంభు ప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీవో హరగోపాల్ పాల్గొన్నారు.



కోర్టులో జడ్జిలు నాగేశ్వరరావు, సౌజన్య ఆధ్వర్యంలో యోగాభ్యాసం



యోగా మాస్టర్ కళాధరరావును సత్కరిస్తున్న విజయం స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి



యోగాసనాలు వేస్తున్న ఎస్ఎస్ఆర్ఐటీ విద్యార్థులు



యోగాసనాలు వేస్తున్న నర్సింగ్ విద్యార్థినులు



ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్‌లో ..



అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



శిల్పారామం యోగా కేంద్రంలో యోగాభ్యాసం చేస్తున్న సాధకులు



యోగాసనాలు వేస్తున్న బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

అనధికార నిర్మాణం తొలగింపు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు తిమ్మాపురంలో సర్వే నంబర్ 314 ప్రభుత్వ స్థలంలో అనధికార నిర్మాణాన్ని శుక్రవారం వీఆర్‌వో అప్పారావు అడ్డుకున్నారు. ఇక్కడ ఓ వ్యక్తి కొండను తవ్వి స్థలాన్ని ఆక్రమించి ఏకంగా ఇల్లు నిర్మిస్తున్నాడు. స్థానికులు అందించిన ఫిర్యాదు మేరకు వీఆర్‌వో అప్పారావు నిర్మాణాన్ని తొలగించారు. ప్రభుత్వ స్థలం ఆక్రమించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, ఇలాంటివి పునరావృతమైతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంగమారిపేటలో...

జీవీఎంసీ 4వ వార్డు టాస్‌పర్క్ కాలనీ నుండి రామాద్రి వరకు ఉన్న కొండపై సర్వే నంబర్ 314 ప్రభుత్వ స్థలంలో అనధికార నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కొందరు నకిలీ పట్టాలు చూపించి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 10 ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ స్థలానికి రక్షణ లేకుండా పోతోందని, రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఓ నాయకుడి కనుసన్నల్లో ఈ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని.. వీటిపై ఆర్డీవో భాస్కర్‌రెడ్డి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అనధికార నిర్మాణాన్ని తొలగిస్తున్న వీఆర్‌వో అప్పారావు

స్కూల్ ఆటోడ్రైవర్లు భద్రతా నియమాలు పాటించాలి

- ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్

విశాఖసిటీ: నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా తిరుగుతున్న ఆటోడ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలని ద్వారకానగర్ ట్రాఫిక్ విభాగం ఎస్ఐ భాస్కర్ సూచించారు. ద్వారకానగర్ శ్రీచైతన్య స్కూల్‌లో రహదారి భద్రతపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రవికిరణ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎస్ఐ భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఆటోడ్రైవర్ తమ వాహనానికి సంబంధించిన పత్రాలను ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. స్కూల్ ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ సిబ్బంది నిర్వహించే తనిఖీలకు సహకరించాలన్నారు. విద్యార్థులతో వస్తున్నప్పుడు డ్రైవర్లు రహదారి క్రమశిక్షణ పాటించాలని ఆదేశించారు. ప్రిన్సిపాల్ రవికిరణ్ మాట్లాడుతూ భావితరాలకు వారధులైన విద్యార్థుల భద్రత ఆటోడ్రైవర్ల చేతుల్లో ఉందన్నారు. అలాగే బాలికల భద్రత విషయంలోనూ డ్రైవర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రిన్సిపల్ సూచించారు. సమావేశంలో శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం ఎంవీ సురేష్, ఆర్ఐ అలీ, డీన్‌లు గొరినాయుడు, సురేష్, ఏవో దిలీప్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్

‘నీట్’ లీకేజీపై నిరసన జ్వాల

సీతమ్మధార: నీట్–2024 పరీక్ష పేపర్ లీకేజీపై నిరసనలు కొనసాగుతున్నాయి. ఏఐఎస్ఈసీ ఆధ్వర్యంలో నీట్ విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం జీవీఎంసీ గాంధీ పార్కులో ఆందోళన చేపట్టారు. ఏఐఎస్ఈసీ రాష్ట్ర సలహాదారుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎన్‌టీఏను రద్దు చేయాలని, నిజాయతీగా పరీక్ష రాసిన విద్యార్థులందరికీ న్యాయం చేయాలని, నీట్ కుంభకోణంలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. అధ్యాపకులు శంకరరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు సత్యవతి, ఎస్.గోవింద్, పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఈసీ ప్రతినిధులు

పాఠ్య పుస్తకాల కిట్ల పంపిణీ

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డులో జీవీఎంసీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాల కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య పాల్గొన్ని విద్యార్థులకు ఈ కిట్లను అందజేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యంతో విద్యలో రాణించాలని ఆమె ఆకాంక్షించారు.

మెరుగైన సాగుకు రైతులకు సలహాలు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బి.వి.కె. జగన్నాథరావు

తగరపువలస : ఆనందపురం మండలంలో గల వెలుగు కార్యాలయంలో అనకాపల్లి పరిశోధనా సహాయ సంచాలకులు డాక్టర్ బి.వి.కె. జగన్నాథరావు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ కృషి మౌసమ్ సేవా పథకం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాతావరణానికి అనుగుణంగా సాగు మెలకువలు వివరించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల రైతులకు శాస్త్రవేత్తల బృందం సలహాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ వి.గౌరి, డాక్టర్ సత్తిబాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



సంతపాలెం ఎంపీపీ పాఠశాలలో జిరాఫీ బొమ్మ వేస్తున్న చిన్నారి

అరిలోవ: చినగదిలి ప్రాంతం సంతపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ జిరాఫీ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతకు పదునుపెట్టారు. పిల్లలు జిరాఫీతో పాటు పలు రకాల వన్యప్రాణులు, చెట్లు, తదితర చిత్రాలు గీసి ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిరికి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవుడికి పంచామృతాభిషేకం నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు శనివారం నిర్వహిస్తామని ఆలయ కార్య నిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా శ్రీవారికి ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ నిర్వహిస్తారు. అనంతరం వివిధ సుగంధ ద్రవ్యాలతో స్వామికి పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. జ్యేష్ఠ సుద్ధ పౌర్ణమి సందర్భంగా 108 వెండి కలశాలతో శ్రీగంధం జలాలను తీసుకువచ్చి స్వామికి కలశాభిషేకం చేస్తారు.

ఐసీఏఐ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం

విశాఖ సిటీ: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) విశాఖ ఛాప్టర్(ఎస్ఐఆర్‌సీ) ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఛార్టెర్డ్ అకౌంటెంట్ సభ్యులతోపాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొని ఆసనాలు వేశారు. యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా మానసిక ఒత్తిడిని జయించి శారీరక దారుఢ్యాన్ని పొందవచ్చని అకౌంటెంట్స్ పేర్కొన్నారు. ఏయూలో యోగా డిప్లమో హోల్డర్ మింటి త్రిమూర్తులు సభ్యులను చైతన్యపరిచారు. మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ అనిర్బాన్ పాల్, కార్యదర్శి పట్నాల లోకేష్, సీఏ వాసుదేవ మూర్తి, స్టూడెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న అకౌంటెంట్లు

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

పద్మనాభం : బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని మండల విద్యా శాఖ అధికారి పొన్నగంటి రమణ అన్నారు. శుక్రవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 12 వరకు నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించాలన్నారు. జూలై నెలాఖరులో ఎఫ్ఏ–1 పరీక్షలు ఉంటాయన్నారు. ఈ పరీక్షలకు నిర్ణీత గడువులోగా సిలబస్ పూర్తి చేయాలన్నారు. బేస్ లైన్ పరీక్ష నిర్వహించి సీ, డీ గ్రేడుల పిల్లలను గుర్తించాలన్నారు. వీరందరికి చదవడం, రాయడం వచ్చేటట్టు చర్యలు చేపట్టాలన్నారు. దృశ్య శ్రవణ పరికరాలను ఉపయోగించి పిల్లలకు బోధించాలని తెలిపారు. సాధారణ పిల్లలతో పాటు దివ్యాంగ పిల్లలను కూడా పాఠశాలల్లో చేర్చుకోవాలన్నారు. పాఠశాలల్లోని గ్రంథాలయాల్లో గల పుస్తకాలను విద్యార్థులు చదివేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో రమణ

రోడ్డు ప్రమాదంలో ఉక్కు రిటైర్డ్ ఉద్యోగి మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పవర్‌గ్రిడ్ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగి ఒకరు మృతి చెందారు. స్టీల్ ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంట్‌లో పదవీ విరమణ చేసిన పైలా నాగార్జునరావు(62) కూర్మన్నపాలెంలో ఉంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం కారులో టౌన్‌షిప్ వెళ్లారు. అక్కడి నుంచి దేశపాత్రునిపాలెం మార్గంలో వెళ్తుండగా కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభం ఒరిగి పోవడంతో పాటు కారు ముందు భాగం నుజ్జయింది. ఈ ఘటనలో నాగార్జునరావు అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనను ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నాగార్జునరావు మృతదేహం

నృసింహునికి గరుడ సేవ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిర్వహించిన గరుడ సేవలో ఒడిశా భక్తులు తరించారు. లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ స్వామికి ఈసేవను జరిపించారు. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్, పట్టుపురం, బరంపురం, పూరి, రాయగడ తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఈ సేవకు హాజరయ్యారు. సాయంత్రం వెండి గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లను అధిష్టింపజేశారు.